క్లుప్తంగా

రేపు మెగా లోక్ అదాలత్

గుడివాడటౌన్: ఏపీ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు ఈనెల 9వ తేదీ గుడివాడ కోర్టులో లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు మండల్ లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ 11వ అదనపు జిల్లా జడ్జి జి. సుబ్రహ్మణ్యం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పెండింగ్‌లో ఉన్న మోటార్ వెహికల్, రెవెన్యూ, దాని అనుబంధ బ్యాంక్, ఇన్సూరెన్స్, ఇతర లావాదేవీల కేసులు ఇక్కడ పరిష్కరిస్తారని పేర్కొన్నారు.

సాయినాథుడికి ప్రత్యేక పూజలు

పామర్రు: స్థానిక సాయినగర్‌లోని షిర్డీ సాయి మందిరంలో కార్తిక మాసం చివరి గురువారం పురస్కరించుకుని విశేష పూజలు చేశారు. తొలుత బాబాకు ఆవుపాలు, పంచామృతాలతో ప్రత్యేకంగా అభిషేకించారు. శత సహస్ర నామాలతో పలురకాల పుష్పాలతో విశేషంగా పూజలు చేశారు. అనంతరం మధ్యాహ్న హారతి ఇచ్చారు. మధ్యాహ్నం అన్న సమారాధన చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తమ్మా వినోద్‌రెడ్డి, ఆలయ అర్చకుడు శర్మ, ఆలయ కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

శరవేగంగా విద్యుత్ పునరుద్ధరణ

పామర్రు: మిచాంగ్ తుపాను కారణంగా వీచిన ఈదురు గాలులకు గ్రామాల్లో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ లైన్లు తెగిపోయాయి. వీటిపై వెంటనే స్పందించిన విద్యుత్ అధికారులు సిబ్బందితో కలిసి మరమ్మతులు చేసి విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకున్నారు. విద్యుత్ శాఖ ఏఈఈ మోహనకృష్ణారావు, సిబ్బంది విద్యుత్ మరమ్మతులు చేశారు.

కార్నియా సేకరణ

గుడివాడ టౌన్: కొనకళ్ల సీతయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఐబాల్స్(కార్నియా) సేకరించినట్లు ట్రస్ట్ చైర్మన్ సీతయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడ్లవల్లేరు మండలం వడ్లమన్నాడుకు చెందిన చిట్టూరి సాయిబాబా సతీమణి కమలకుమారి మృతి చెందారు. కుటుంబ సభ్యుల అనుమతితో కార్నియా సేకరించి విజయవాడ ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తరలించినట్లు ఆయన పేర్కొన్నారు.

గుర్రపుడెక్క తొలగింపు

కలిదిండి: లాల్వా డ్రైన్, పోతుమర్రు కాలువలోని గుర్రపు డెక్క తొలగింపు పనులను వెయ్యి మంది జాబ్ కార్డుదారులతో ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో ఆనంద్ బాబు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) నాయకులతో కలసి వీటిని పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలో సానరుద్రవరం, గోపాలపురం, పడమటిపాలెం, ఆయకట్టు మధ్య గల లాల డ్రెయిన్‌కు ఎన్ఆర్ఈజీఎస్ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. అనంతరం ఆయకట్టు ప్రాంతంలో నీట మునిగిన పంట పొలాలు పరిశీలించి రైతులను ఆదుకుంటామని ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, ఎంపీడీవో దినతేజ్, వ్యవసాయ ఏడీఏ గంగాధరరావు, గోపాలపురం సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు, తదితరులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో గుడివాడ విద్యార్థుల ప్రతిభ



గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో గుడివాడ మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు ప్రతిభను సాధించి ప్రథమస్థానం కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయిని జి.పద్మావతి తెలిపారు. విజయం సాధించిన విద్యార్థులను గురువారం ఆమె అభినందించారు. ఆమె మాట్లాడుతూ ఈ నెల 1, 2 తేదీల్లో చిత్తూరు జిల్లా యాదమర్రిలో జరిగిన అండర్ -16 బాలుర విభాగం బాస్కెట్‌బాల్ పోటీల్లో కృష్ణా జిల్లా తరుపున ఆడిన టీమ్‌లో విద్యార్థులు ప్రతిభ కనపర్చారన్నారు. విజేతలను పాఠశాల ప్రెసిడెంట్ వి.లక్ష్మి, కరస్పాండెంట్ పి.వి.వి.రమాదుర్గ, యాజమాన్యం తదితరులు అభినందించారు.

డిజిటల్ అక్షరాస్యతపై కళాజాత

పాములపాడు(పెదపారుపూడి): పాములపాడు పీఎసీఎస్ బ్యాంక్ వద్ద గురువారం జిల్లా సహకార కేంద్రబ్యాంక్ ఆధ్వర్యాన నాబార్డ్ సౌజన్యంతో డిజిటల్ ఆర్థిక అక్షరాస్యతపై కళాజాత బృందం రైతులకు అవగాహన కల్పించింది. కళాజాత బృందం సహకార బ్యాంక్ ఖాతాలతో రైతులకు కలిగే మేలు వివరించి పొదుపు ఖాతా ఉండాలన్నారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

కవల దూడల జననం



పామర్రు: గ్రామస్థుడు, రైతు రేపల్లె సాంబశివరావుకు చెందిన ఆవుకు ఒకే కాన్పులో గురువారం కవలదూడలు జన్మించాయి. వీటిలో ఒకటి మగ, మరొకటి ఆడ దూడలు. దీనిపై పామర్రు పశు సంవర్ధకశాఖ ఏడీ డాక్టర్‌చిమటా శశి కుమార్ మాట్లాడుతూ పామర్రులోని పశు వైద్యశాలలోనే ఆవుకు కృత్రిమ గర్భోత్పత్తి చేస్తారాన్నారు. రెండు కవల దూడలు పూర్తి ఆరోగ్యంగా ఉన్నాయని తెలిపారు.

అన్నదాతకు అండగా..



గుడ్లవల్లేరులో పంట నష్టాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని



ఊటుకూరులో రైతుకు ధైర్యం చెబుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్



ఎలకుర్రులో వర్షాలకు తడిసిన వరి పనలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

అన్నదాతకు అండగా ఉండటానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రైతులకు అవసరమైన సలహాలు, సూచనలను అధికారులు ఇస్తున్నారు. గుడివాడ, పామర్రు, కైకలూరు ఎమ్మెల్యేలు కొడాలి నాని, కైలే అనిల్‌కుమార్, దూలం నాగేశ్వరరావు.. పొలాలను పరిశీలించి అధైర్య పడొద్దు.. ఆదుకుంటామని రైతుకు భరోసా ఇచ్చారు.

- పొలాలను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు
- వ్యవసాయ అధికారుల సూచనలు
- వాహనాల్లో ధాన్యం తరలింపు

పమిడిముక్కల: రైతును ఆదుకోవడానికి ప్రభుత్వం చకచకా చర్యలు తీసుకుంది. గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో ధాన్యం కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసింది. తేమశాతం ఎంతున్నా రైతు నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేయడం, అవసరమైనన్ని వాహనాలు ఏర్పాటు చేసి పక్క జిల్లాలకు తరలిస్తున్నారు. పమిడి ముక్కల మండలంలో 20 వేల ఎకరాల్లో వరిసాగు చేయగా, 14 వేల ఎకరాల్లో పంట నష్టం ఏర్పడింది. సకాలంలో ధాన్యాన్ని తరలించడం, మద్దతు ధర లభిస్తుండటంతో రైతులు పొలం పనుల్లో బిజీగా ఉన్నారు. నేలవాలిన వరిని పైకి లేపి కట్టడం, తడిసిన పనలను తిరగవేసుకోవడం, ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తున్నారు. కుప్పలోకి నీరు చేరడంతో వరికట్టలను తీసి ఆరబెడుతున్నారు. యంత్రంతో నూర్చిన ధాన్యాన్ని ఆరబెట్టి ఆర్బీకేలకు తరలిస్తున్నారు. ఐనపూరులో 20 ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని ఏఓ గణేష్‌రెడ్డి తెలిపారు. పడిపోయిన అరటి చెట్లు, గెలలు కాలువల్లో, డ్రెయిన్లలో పడవేయకుండా చేలల్లో తిరగకొట్టాలని, అరటి చెట్టు నిండా పొటాష్ ఉంటుందని తెలిపారు.

పామర్రు: నీటి మునిగిన పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నాలు చేస్తున్నారు. నీటిలో ఉన్న వరి మొక్కలను పైకి లేపి కడుతున్నారు. పనలను తిరగవేసి మళ్లీ ఎండబెడుతున్నారు. కొన్ని చోట్ల తడిసిన వరి మొక్కల కంకిలకు ఉన్న వరి గింజలకు మొలకలు వస్తున్నాయి. రైతులు.. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు సలహాలను పాటిస్తున్నారు. పొలంలో నిల్వ ఉన్న నీటిని పూర్తిగా తొలగించేలా నీటి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ షెడ్లు తీసి నీటి తొలగింపు చర్యలు చేపడుతున్నారు. నీరు పూర్తిగా పోయిన తర్వాత ఉప్పునీటి ద్రావణాన్ని వరి పంటపై చల్లితే మొలకెత్తడం కొంత తగ్గుతుందని వ్యవసాయ శాఖ అధికారి శివ నాగరాణి తెలుపుతున్నారు. నీట మునిగిన పొలాలలను పామర్రు వైస్ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు పరిశీలించారు. రైతులు బి.కృష్ణారెడ్డి, బి. మాధవరెడ్డి, శ్రీనివాసరావు, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. ఉండ్రపూడి, పోలవరం, జమీదగ్గుమిల్లి, రాపర్ల తదితర గ్రామాల్లో పొలాల్లో నీటిని రైతులు తొలగించే పనులను చేస్తున్నారు.

తోట్లవల్లూరు: వర్షాలు తగ్గుముఖం పట్టడంతో రైతులు పొలాల నుంచి ముంపు నీటిని బయటకు పంపే పనులతోపాటు సస్యరక్షణ చర్యలు నిర్వహిస్తున్నారు. తహసీల్దార్ కుసుమకుమారి, మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరావు గ్రామాల్లో పర్యటిస్తూ నీట మునిగిన వరిపొలాలను పరిశీలించి సూచనలు చేశారు.

అధైర్యపడొద్దు.. ఆదుకుంటాం

ఎలకుర్రు(పామర్రు): నియోజకవర్గంలో రైతులు అధైర్యపడొద్దని అందరినీ ఆదుకుంటామని పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ అన్నారు. మిచాంగ్ తుపాను కారణంగా కురిసిన వర్షాలకు నీట మునిగిన పంటలను ఎమ్మెల్యే గురువారం పరిశీలించారు. ఎలకుర్రు, ప్రాకర్ల గ్రామాలలోని తుఫాను ప్రభావిత పంట పొలాలలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పంటల రక్షణకు అన్ని విధాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేయడంలో తోడుగా ఉంటామన్నారు. అధికారులు తుపాను బాధితుల పట్ల ఉదారంగా వ్యవహరించాలన్నారు. నష్ట అంచనాలు వేసి నివేదికలు పంపాలని అధికారులను ఆదేశించారు. పొలాల్లో నీటిని డ్రెయిన్‌ల ద్వారా దిగువకు ప్రవహించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఎలకుర్రు డ్రెయిన్‌లో ఉన్న అడ్డంకులు తొలగించి నిల్వ ఉన్న నీరు దిగువకు పోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు.

రైతులకు భరోసా

కష్టకాలంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అందరికీ అండగా ఉండి ఆదుకుంటుందన్నారు. రైతులకు అన్ని విధాలా సాయం చేస్తుందని చెప్పారు. స్థానిక అధికారులను అడిగి పంట నష్టాన్ని తెలుసుకున్నామన్నారు. పూర్తి స్థాయిలో పంట నష్టం అంచనాలు అందిన వెంటనే ప్రభుత్వం రైతులను ఆదుకుంటుందని అన్నారు. మినుము విత్తనాలను సబ్సిడీలపై రైతులకు అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. కార్యక్రమంలో సర్పంచులు పానే శివ మస్తాన్‌రావు, గొంతుపులి రామలింగేశ్వరరావు, కొనగాల భాస్కరరావు, ఎంపీటీసీ పల్లికొండ రత్న కుమారి, గ్రామంలోని రైతులు పాల్గొన్నారు.

ఆందోళన వద్దు.. అండగా ఉంటాం

ముదినేపల్లి రూరల్: తుపాను ప్రభావంతో పంటలు నష్టపోయామని ఆందోళన చెందాల్సిన పని లేదని నిబంధనల మేరకు ప్రభుత్వం ఆదుకుంటుందని స్థానిక ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. దేవపూడి ఊటుకూరు గ్రామాల్లో ఎమ్మెల్యే గురువారం పర్యటించి ముంపు బారిన పడ్డ పొలాలను పరిశీలించారు.

తడిసిన, రంగుమారిన ధాన్యాన్ని ఎమ్మెల్యేకు చూపి న్యాయం చేయాలని పలువురు రైతులు కోరారు.

రైతు సంక్షేమమే ధ్యేయం

పంట నష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే కొడాలి నాని

గుడ్లవల్లేరు: రైతు సంక్షేమమే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వ ధ్యేయమని గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. తుపానుకు దెబ్బ తిన్న వరి పొలాలను గురువారం పరిశీలించిన ఆయన రైతులకు జగన్ ప్రభుత్వం అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. ముంపునకు గురైన వరి పంటను ఎమ్మెల్యే కొడాలికి రైతులు చూపించారు. తుపాను ప్రభావంతో నష్టపోయిన రైతాంగానికి నూరు శాతం సహకారమందించడానికి తమ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని కొడాలి తెలిపారు. దెబ్బ తిన్న రైతులకు ఆర్బీకేల ద్వారా సబ్సిడీ విత్తనాలను పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు.

అంతరిక్షం నుంచి దిగుమతైనా.. వైఎస్సార్ సీపీని ఓడించలేరు..

అమెరికా నుంచి కాదు...అంతరిక్షం నుంచి దిగుమతైనా గుడివాడలో వైఎస్సార్ సీపీని ఓడించలేరని కొడాలి నాని టీడీపీ నాయకులకు సవాల్ విసిరారు. తన గొంతులో ప్రాణం ఉన్నంత వరకూ గుడివాడ గడ్డపై వైఎస్సార్ సీపీని ఓడించలేరని హెచ్చరించారు. రాబోయే ఎన్నికల తర్వాత రావి వెంకటేశ్వరరావుకే టీడీపీ ఇన్‌చార్జి మళ్లీ ఇస్తారన్నారు. ఎన్టీఆర్ స్టేడియం వైస్ చైర్మన్ పాలేటి చంటి, కేడీసీసీ జిల్లా డైరెక్టర్ పడమటి సుజాత, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శాయన రవి, ఎంపీపీ కొడాలి సురేష్, ఎంపీడీఓ డి.శ్రీనివాస్, తహసీల్దార్ అబ్దుల్ రెహ్మాన్ సుల్తానా, ఏఓ సునీల్, పీఏసీఎస్ అధ్యక్షుడు శేషం గోపి, వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకర్, ఎంపీటీసీ మండా దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వం రైతులను ఆదుకునేందుకు కృషి చేస్తోందన్నారు.

రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు చొరవ తీసుకొని రైతులకు అండగా నిలవాలని కోరారు. ఆయనతోపాటు ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, ఎంపీటీసీ గుమ్మడి వెంకటేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు కట్టా మహేష్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు, నాయకులు రాచూరి కుమార్, జోగి సురేష్, దాసరి నాని, పెద్ది వీరయ్య, దాసరి పాములు, ఉల్లంకి అశ్వినీకుమార్, ఏడీఏ వెంకటమణి, ఏవో వేణు మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకుంటాం

కలిదిండి: రైతులు అధైర్య పడవద్దని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సూచించారు. సానరుద్రవరం గ్రామంలో ఉన్న కల్లంలో తడిసిన, రంగు మారిన ధాన్యం, తడిసి మొలకెత్తిన ధాన్యంను గురువారం నాయకులు, అధికారులతో కలసి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు వడ్లాని పార్థసారథి, గోపాలపురం సర్పంచ్ అనపర్తి వడ్డి కాసులు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పాము రవికుమార్, నున్న రామచంద్రరావు, మసీముక్కుల వెంకటేశ్వరరావు, ఎంపీడీవో దినతేజ్, ఏడీఏ గంగాధర్ రావు, ఏవో కె.విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: లింగాలలో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అధికారులు, నాయకులతో కలిసి తడిసిన ధాన్యం పరిశీలించారు. ఎంపీపీ శ్రీరామదుర్గాప్రసాద్(రాము), వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ నాయనబాబు, ఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఐనపూరులో అరటి తోటను పరిశీలిస్తున్న వ్యవసాయ, ఉద్యాన సిబ్బంది



పమిడిముక్కలలో ధాన్యం కాటా వేస్తున్న కూలీలు



పామర్రులో..



వల్లూరుపాలెంలో వరిపైరును పరిశీలిస్తున్న తహసీల్దార్ కుసుమకుమారి

గుడివాడలో.. జగనన్నే ఎందుకు కావాలి..



పథకాల వివరాల బోర్డు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గుడివాడ టౌన్: ఏపీకి జగనన్నే ఎందుకు కావాలి కార్యక్రమం గురువారం పట్టణంలోని 8వ వార్డు సచివాలయంలో నిర్వహించారు. ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న జగనన్న నాలుగున్నరేళ్ల పాలనలో 8వ వార్డుకు సంబంధించి 2,524 మంది లబ్ధిదారులకు ప్రత్యక్షంగా రూ.8, 38,96,435.. పరోక్షంగా 1,285 మంది లబ్ధిదారులకు రూ.4, 86,31,753, మొత్తం రూ.13,25 28,188 లబ్ధి చేకూర్చారని నాయకులు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు గొర్ల శ్రీను, 8వ వార్డు ఇన్‌చార్జ్ ఆంజనేయ ప్రసాద్, పట్టణ కార్యదర్శి చింతల భాస్కరరావు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎస్కే బాజీ, దుడ్డు చిన్నా తదితరులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: ప్రజా సమస్యలను పరిష్కరించే నాయకులనే ప్రజలు కోరుకుంటున్నారని వైఎస్సార్ సీపీ నాయకులు అన్నారు. పట్టణంలోని 5వ వార్డులో వార్డు కన్వీనర్‌లు, బూత్ కన్వీనర్‌లు గురువారం ఇంటింటికీ తిరిగి నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం పేదలకు అమలు చేసిన సంక్షేమ పథకాలు, ప్రజలకు అందిన లబ్ధి అంశాలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని తిరిగి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జ్ వెంపల అప్పారావు, కన్వీనర్ కె.మహాలక్ష్మి, కె.గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు



బ్లీచింగ్ చల్లుతున్న పారిశుద్ధ్య సిబ్బంది

పామర్రు: మిచాంగ్ తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలకు డ్రెయినేజీల్లో పేరుకు పోయిన మురుగు తొలగింపు చర్యలు గురువారం నిర్వహించారు. కూర్మాపురం, యాదవాపురం, శ్యామలాపురం, హరిగోపాల్‌నగర్, కొబ్బరి తోట తదితర ప్రాంతాల్లో కాల్వలు శుభ్రపరిచారు. రోడ్ల వెంట బ్లీచింగ్ తదితరాలను చల్లించామని గ్రామ కార్యదర్శి సలీం తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ మేస్త్రి నాగ, పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని పెరికెగూడెంలో సర్పంచ్ పెరుమాళ్ల పద్మ ఆధ్వర్యంలో గురువారం పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రెయిన్లను శుభ్రం చేశారు. రహదారులపై చెత్తా చెదారాలను తొలగించి, సున్నం, బ్లీచింగ్ పిచికారీ చేశారు. సర్పంచ్ పద్మ మాట్లాడుతూ పారిశుద్ధ్య సమస్యల కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందన్నారు. పారిశుద్ధ్య మెరుగుదలకు తగిన చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. పెరుమాళ్ల సత్యనారాయణ, కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.

రైల్వేగేట్ వద్ద వాన నీరు తొలగింపు



మండవల్లి: మండవల్లిలో రైల్వేగేట్ వద్ద వర్షం నీటిని సర్పంచ్ మెండా ఝాన్సీ గురువారం తొలగింపజేశారు. మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు గ్రామంలోని పలు చోట్ల వర్షం నీరు నిలచి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. స్థానిక రైల్వేగేట్ వద్ద పల్లంగా ఉండి రోడ్డుపై నీరు నిలవడంతోసర్పంచ్ ఝాన్సీ చర్యలు తీసుకున్నారు. వైఎస్సార్ సీపీ నాయకుడు మెండా సురేష్ తదితరులు పాల్గొన్నారు.

తోట్లవల్లూరు వద్ద కృష్ణమ్మ పరుగులు




తోట్లవల్లూరు: కృష్ణా నదికి ఆకస్మిక వరదతో రైతులు, కూలీలు అవస్థలకు గురయ్యారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా విజయవాడ ప్రకాశం బ్యారేజి నుంచి మిగులు నీటిని అధికారులు సుముద్రంలోకి విడుదల చేశారు. దీంతో తోట్లవల్లూరు రేవుకు గురువారం తెల్లవారుజామున వరద ప్రవాహం చేరుకుంది. దీంతో లంకలకు వెళ్లే తాత్కాలిక బాటలు కోతకు గురి కావటంతోపాటు నీటి ముంపునకు గురయ్యాయి.

బీసీ భవన్‌కు స్థలం కేటాయించండి

గుడివాడ టౌన్: పట్టణంలో బీసీ భవన్ నిర్మాణానికి స్థలం ఏర్పాటు చెయ్యాలని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ని గుడివాడ బీసీ సంఘం నాయకులు కోరారు. ఆయన నివాసంలో గురువారం బీసీ సంఘం నాయకులు కలిసి వినతిపత్రం సమర్పించారు. దీనిపై స్పందించిన కొడాలి నాని పట్టణంలో ఖాళీగా ఉన్న రెండు వేల గజాల స్థలాన్ని బీసీ భవన్ ఏర్పాటుకు సమకూర్చే ఏర్పాట్లు చెయ్యాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. సాధ్యమైనంత త్వరలో స్థలం సేకరించి భవన నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తామని ఎమ్మెల్యే నాని హామీ ఇచ్చారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించవలసిందిగా బీసీ సంఘం నాయకులకు ఆయన సూచించారు. బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి రావులకొల్లు మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నయనవరపు శేషుబాబు, ఎస్ రంగారావు, టి రాధ, పట్టణాధ్యక్షుడు దారం నరసింహరావు, బీసీ ఉద్యోగ సంఘం నాయకుడు జి ప్రభాకర్, డి వెంకట రామకృష్ణ తదితరులు కమిషనర్ మురళీకృష్ణకు వినతిపత్రం సమర్పించారు.

లాల్వ డ్రెయినేజీని ఉప్పుటేరు వరకు బాగుచేయాలి



కలిదిండి: కలిదిండి నుంచి ఉప్పుటేరు వరకు ఉన్న లాల్వ డ్రెయినేజీని పూర్తిస్థాయిలో బాగు చేయాలని ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు అధికారులను కోరారు. ఆయన ఎంపీడీవో దినతేజ్‌తో కలిసి గురువారం ఉప్పుటేరు వంతెన వద్ద నీటికి అడ్డుగా ఉన్న కిక్కిసను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ కలిదిండి నుంచి ఉప్పుటేరు వరకు కిక్కిసతో లాల్వా డ్రెయినేజీ నిండి మురుగునీటి పారుదలకు ఆటంకం కలిగిస్తోందన్నారు. దీనిపై రూ.15 లక్షలతో అధికారులు ప్రతిపాదనలు పంపామన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ

మండలంలో జరగనున్న ఆడదాం ఆంధ్ర క్రీడా పోటీల కిట్లను ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన ఎంపీడీవో దినతేజ్ పంపిణీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులతో మండలంలోని గ్రామ సచివాలయ కార్యదర్శులకు అందజేశారు. ఈ నెల 15 నుంచి క్రీడా పోటీలు జరుగనున్నట్లు ఆయన తెలిపారు.

షటిల్ బ్యాడ్మింటన్‌లో విజేతలకు అభినందన



క్రీడాకారులను అభినందిస్తున్న ఏఎన్నార్ కాలేజీ యాజమాన్యం

గుడివాడ టౌన్: అంతర్ కళాశాలల షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో తమ విద్యార్థులు హ్యాట్రిక్ విజయాన్ని సాధించారని ఏఎన్నార్ కళాశాల ప్రిన్సిపాల్ పీజేఎస్ కుమార్ తెలిపారు. కళాశాల కార్యాలయంలో గురువారం క్రీడాకారులను యాజమాన్యం సత్కరించింది. క్రీడాకారులు ఐ. ఈశ్వరసాయి, వి.కృష్ణ సాయి జట్టు మూడవ సారి విజయం సాధించగా జె. ఫణికృష్ణ, ఎస్.నితీష్ కుమార్, ఎం .వేణుగోపాలుడు, ఎండీ ఇబ్రహీం, కె. ఫణికిరణ్ తమిళనాడులో జరిగే సౌత్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీస్ చాంపియన్‌షిప్ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించారన్నారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ కేఎస్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శివనాథ్ పీడీ వీర్ల గోపి, అధ్యాపకులు పాల్గొన్నారు.

స్కేటింగ్ హాకీ పోటీలకు గౌతమ్ విద్యార్థులు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్

గుడివాడ టౌన్: రాష్ట్ర స్థాయి స్కేటింగ్ హాకీ పోటీల్లో ప్రతిభను ప్రదర్శించి జాతీయ క్రీడలకు తమ విద్యార్థులు అర్హత సాధించినట్లు కేకేఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ పి.లక్ష్మీప్రసాద్ తెలిపారు. నవంబర్ 20 నుంచి డిసెంబరు 5 వరకు విశాఖపట్నంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో కృష్ణా జిల్లా నుంచి పాల్గొన్న విద్యార్థులు జాతీయ పోటీలకు రాష్ట్రం తరుపున ఆడేందుకు ఎంపికయ్యారన్నారు. క్యాడెట్ విభాగంలో జి.శ్రీమంత్, ఎస్ఎన్ అఖిలాష్‌గౌడ్, ఎస్ఎల్ సాత్విక్, సబ్ జూనియర్ బాలికల విభాగంలో ఇ.నిఖిల, ఎం .ఖ్యాతి అభిజ్ఞలు ఈ నెల 10 నుంచి 22వ తేదీ వరకు చండీగఢ్‌లో జరిగే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. సత్తా చాటిన విద్యార్థులను కోచ్ పీఎస్వీఎస్ అయ్యప్పలను పాఠశాల ప్రిన్సిపాల్స్ సత్యారామ్, జ్యోతి, జబ్రీనాలు అభినందించారు.

జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ రవీంద్ర మృతి

కైకలూరు: ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సూరగాని రవీంద్ర(61) ఊపిరితిత్తుల సమస్యతో బుధవారం అర్ధరాత్రి మరించారు. కాలేజీకి గురువారం సెలవు ప్రకటించారు. ఏలూరు సమీప పినకడమికి చెందిన రవీంద్ర రానున్న ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ చేయనున్నారు. అధ్యాపకులు, విద్యార్థులు, పిరమిడ్ సభ్యులు కన్నీటి నివాళి అర్పించారు.

రాజగోపాలస్వామి ఆలయంలో దీపోత్సవం

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో గురువారం రాత్రి శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత రాజగోపాలస్వామి ఆలయంలో కార్తిక మాసం సందర్భంగా శంకచక్రనామ ఆకారంలో దీపోత్సవం కనులపండువగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు గౌతమ్‌కుమార్ పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.